మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నంబర్లు

ట్రాఫిక్ సీఐ ప్రశాంత్	9491039172
ఆర్ఐ అనిల్	9490617353
ఎస్ఐ మల్లేష్	9618581332
ఎస్ఐ నవీన్	8712568404
ఎస్ఐ సుభాష్	8712663542
చందానగర్ పోలీస్‌స్టేషన్..	
ఎస్‌హెచ్‌ఓ పాలవెల్లి	9491039172
ఎస్ఐ నాగేశ్వర్‌రావు	9010851257
ఎస్ఐ శ్రీధర్	8712663181
ఎస్ఐ సరితారెడ్డి	7993183570
ఎస్ఐ రఘు	8712663184
ఎస్ఐ రమేష్	9866859530
ఎస్ఐ కిష్టయ్య	8712663275

'మనూ'లో ప్రవేశ ఆధారిత కోర్సులు దరఖాస్తుల గడువు పెంపు

రాయదుర్గం: మనూలో ప్రవేశ ఆధారిత కోర్సుల దరఖాస్తు గడువు తేదీని పెంచినట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ సోమవారం తెలిపారు. యూనివర్శిటీలోని పీహెచ్‌డీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, బీటెక్, బీఈడీ, బీఏలకు ప్రవేశ ఆధారిత ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి గడువును పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ(ఆనర్స్), ఎల్ఎల్‌బీ, పీజీ డిప్లొమో/డిప్లొమో, సర్టిఫికెట్ రెగ్యులర్ కోర్సులు 2024–25 విద్యాసంవత్సరానికి మే 30 వ తేదీ వరకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకొని ఈ అవకాశం కల్పించామన్నారు. అయితే ప్రవేశ పరీక్షలు షెడ్యూల్ 2024 జూన్11, 12,13 తేదీలలో జరుగుతాయన్నారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు సమర్పించడానికి చివరి తేదీ వరకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం అడ్మిషన్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలన్నారు. ఫోన్ నంబర్లు 6207728673, 9866802414, 6302738370, 7500496666, 8374346948లలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ల లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషెంట్‌కు రూ.30లు చెల్లించాలి. రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్ష చేస్తారు. ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా చేస్తారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా మంగళవారం గుల్‌మొహర్‌పార్కు కాలనీ, బాపూనగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11 కేవీ బాపూనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు గోపీనగర్, నెహ్రూనగర్, బాపూనగర్‌లలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

మదీనాగూడ, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో..

హఫీజ్‌పేట్ : మదీనాగూడ, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో 11కేవీ ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఆల్విన్‌కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మైత్రీనగర్ ఫేజ్-1, మదీనాగూడ విలేజ్, దైనిష్ అపార్ట్‌మెంట్, కల్కి హైట్స్, జీ హబిటాట్, కల్లం అంజిరెడ్డి స్కూల్, పైప్‌లైన్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్‌కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్ఈఎల్ హెచ్ఐజీ, మైత్రీనగర్ ఫేజ్ 1,2,3 ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ, బ్రాహ్మణ్ సదన్, అలాగే జయభేరి ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీ హెచ్‌బీ కాలనీ రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్ గేట్ నెంబర్ 1,2,3 తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన



డ్రైనేజీ లైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్, డీజీఎం శివకుమార్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీ, చైతన్యనగర్ కాలనీ, జాతీయ రహదారి పక్కన గల విక్టోరియా షాప్ ముందు, బండ్లగూడలోని మార్క్స్ నగర్ కాలనీలో పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ మాట్లాడుతూ... వర్షాలు పడుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలలో పూడిక తీయాలన్నారు.

నాగపడగ బహూకరణ



మణికొండ: మైహోం అవతార్ నివాసి పూర్ణం లక్ష్మీ శ్రీనివాస్ దంపతులు 800 గ్రాముల వెండితో తయారు చేయించిన నాగపడగను సోమవారం మహాశివుడికి అలంకరింప చేశారు. మైహోం అవతార్ పక్కన ఉన్న శ్రీ సంకటహర హనుమాన్ దేవాలయం ఆవరణలో ఉన్న శివాలయంలో అర్చకులకు నాగపడగను అందజేశారు.కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులతో పాటు భక్తులు, దేవాలయ అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చినుకొస్తే వణుకే..

- వాటర్ లాగింగ్‌తో ఐటీ కారిడార్ గ్రిడ్ లాక్
- భారీ వర్షం వస్తే ట్రాఫిక్ పోలీసులకు కంటి మీద కునుకు ఉండదు
- వర్షాలు వచ్చినప్పుడే యాక్షన్ ప్లాన్
- ఐదేళ్లుగా సమన్వయ సమావేశాలతో సరి

శిల్పారామం రోడ్డులో...



శిల్పారామం రోడ్డులోని వాటర్ లాగింగ్ పాయింట్

సైబర్ టవర్ నుంచి కొత్తగూడ వెళ్లే రోడ్డులో శిల్పారామం వద్ద భారీగా వరద నీరు చేరుతోంది. జయభేరి ఎన్‌క్లేవ్, వైట్ ఫీల్డ్స్, సిద్దిఖీ నగర్ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, పర్వత్‌నగర్ వైపు నుంచి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు.

పరిష్కారమిలా..

ప్రస్తుతం ఉన్న నాలా విస్తీర్ణం వచ్చే వరదకు తగ్గట్లుగా లేదు. శిల్పారామం రోడ్డుకు కింది భాగంలోనే తుమ్మిడి కుంట ఉంటుంది. ప్రత్యేకంగా వరద నీటి పైపు లైన్‌వేస్తే సమస్య పరిష్కారమవుతుంది.



మాదాపూర్ సిటీ వైన్స్ జంక్షన్‌లో వరద (ఫైల్)



కొత్తగూడ జంక్షన్‌లో.. వరద నీటిలో నడుచుకుంటూ వెళుతున్న ఐటీ ఉద్యోగులు(ఫైల్)



సిటీ వైన్స్ జంక్షన్ వద్ద..

గచ్చిబౌలి: వాటర్ లాగింగ్ పాయింట్లు ట్రాఫిక్ పోలీసులకు, వాహనదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సిటీ వైన్స్, సీఓడీ జంక్షన్, శిల్పారామం, కొత్తగూడ జంక్షన్, క్యూమార్ట్ , డీఎల్ఎఫ్ రోడ్డు, బయోడైవర్సిటీ జంక్షన్, బొటానికల్ గార్డెన్ అంటూ భారీ వర్షం వచ్చినప్పుడు ఐటీ కారిడార్ ట్రాఫిక్ పోలీసుల మ్యాప్‌లో వినిపిస్తోంది. వరద నీటి ఉధృతి, సహాయక చర్యలు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తుంటారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించేంత వరకు ట్రాఫిక్ పోలీసులు వర్షంలోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వరదకు ట్రాఫిక్ పోలీసులకు సంబంధం ఉండదు.. కానీ వరద నివారణ చర్యలు చేపట్టాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు సమస్య ఉన్నప్పుడు పైపై పనులతో సరి పెట్టేస్తున్నారు. భారీ వర్షం వచ్చిందంటే సైబర్ టవర్ నుంచి జెఎన్‌టీయూ, సైబర్ టవర్ నుంచి కొత్తగూడ, మసీద్ బండ, డీఎల్ఎఫ్ రోడ్డు, గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం, కొత్తగూడ నుంచి ఆల్విన్‌కాలనీ జంక్షన్ వరకు ట్రాఫిక్ ఉంటోంది. ఐటీ ఉద్యోగులు ఇళ్లకు చేరాలంటే మూడు గంటలకు పైనే పడుతోంది. శాశ్వత పరిష్కారం చూపకపోతే ఎన్నేళ్లయినా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వరద నీటి కారణంగా వర్షంలోనే రోడ్లపై వాహనదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. నాలాల విస్తరణ, రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం సమయంలో ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద..

మాదాపూర్‌లోని సిటీ వైన్స్ జంక్షన్‌లో భారీ వర్షం కురిస్తే 3 అడుగుల లోతు నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. వరద తగ్గేందుకు రెండు గంటల సమయం పడుతోంది. సైబర్‌టవర్ జంక్షన్ నుంచి కిలోమీటరుకు పైగా ట్రాఫిక్ జాం నెలకొంటోంది. జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వాహనదారులు నరకం చూస్తున్నారు.

ఇదీ పరిష్కారం..

ప్రస్తుతం ఉన్న నాలా విస్తరణ చేస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లేందటే వరద నీటి కోసం ప్రత్యేక పైపులైన్ వేయాల్సి ఉంటుంది. నాలాలోకి వరద నీరు సవ్యంగా వెళ్లేలా మ్యాన్‌హోల్స్ సంఖ్యను పెంచితే తాత్కాలిక పరిష్కారం లభిస్తుంది.

బొటానికల్ గార్డెన్

బొటానికల్ గార్డెన్ ప్రధాన ద్వారం సమీపంలో ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం నిర్మిస్తున్న ఫుట్‌పాత్ కారణంగా వరద నీరు వెళ్లడం లేదు. బొటానికల్ గార్డెన్‌లోకి వరద వెళ్లకుండా కాంక్రీట్ వాల్ అడ్డుగా ఉంది. రోడ్డుకు అవతల వైపు ఉన్న నాలాను ఓ నిర్మాణ సంస్థ వ్యర్థాలతో పూడ్చి వేసింది. దీంతో వరద నీటి సమస్య తప్పడం లేదు.

నాలాలోకి మళ్లించాలి

వరద నీరు బొటానికల్ గార్డెన్‌లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. అవతల రోడ్డులోని వరదను నాలాలోకి మళ్లించాలి.

ఇవి మచ్చుకు మాత్రమే..

ఐటీ కారిడార్‌లో పైన పేర్కొన్న వాటర్ లాగింగ్ పాయింట్లు మచ్చుకు మాత్రమే. బయోడైవర్సిటీ, ట్రిపుల్ ఐటీ సబ్‌స్టేషన్, రాయదుర్గం, ఖాజాగూడ, ఆర్టీఓ ఆఫీస్, మదీనాగూడ ప్రధాన రహదారి, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో వరద నీటి సమస్య ఉంది.

కొత్తగూడ రోడ్డు



కొత్తగూడ జంక్షన్‌లో వాటర్ లాగింగ్ పాయింట్

కొత్తగూడ జంక్షన్‌లోని శ్మశానవాటిక వద్ద ప్రధాన రహదారిపై భారీస్థాయిలో వరద నీరు చేరుతోంది. భారీ వర్షం వస్తే హైటెక్ సిటీ నుంచి హఫీజ్‌పేట్, గచ్చిబౌలి, మసీద్ బండ వైపు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నిర్మించిన ఫుట్‌పాత్, మెడిన్‌లు కారణంగా వరద నీరు నాలాలోకి వెళ్లడం లేదు.

రోడ్డు ఎత్తు పెంచితే..

రోడ్డు ఎత్తును పెంచితే వరద నీరు కొత్తగూడ నాలాలోని మళ్లించ వచ్చు. లేదా మెడిన్ నుంచి వరద నీరు నాలాలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.

యాక్షన్ లేని ప్లాన్..

వర్షాలు కురిసినప్పుడే జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయ సమావేశాలు, యాక్షన్ ప్లాన్ అని హడావిడి చేయడం పరిపాటిగా మారింది. ఐదేళ్లుగా 50కి పైగా సమన్వయ సమావేశాలు నిర్వహించిన అధికారులు శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. సమస్యల పరిష్కారంలో విద్యుత్ శాఖ, మెట్రో వాటర్ వర్క్స్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, హెచ్ఆర్‌డీసీఎల్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. అందులో ప్రధాన భూమిక జీహెచ్ఎంసీది. రోడ్ల ఎత్తును పెంచడం, వరద కోసం ప్రత్యేక పైపులైన్ వేయడం, నాలాల విస్తరణ చేపట్టి ఉంటే మంచి ఫలితాలు ఉండేవి. ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు ఉన్నా వర్షం వస్తే ట్రాఫిక్ సమస్య వీడటం లేదు. వర్షాలు వచ్చినప్పుడు యాక్షన్ ప్లాన్ అనకుండా శాశ్వత పనులు చేపడితే లక్ష్యం నెరవేరుతుంది.

డీఎల్ఎఫ్ రోడ్డు

డీఎల్ఎఫ్ రోడ్డులో దాదాపు రోజు 30 వేలకు పైగా ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు ఏటవాలుగా ఉండటంతో భారీ వర్షం వస్తే మెడ్‌ప్లస్ వద్ద భారీగా వరద నీరు చేరుతోంది. సాయంత్రం వర్షం వచ్చిందంటే వాహనాలు వెళ్లలేనంతగా వరద చేరడంతో ఐటీ ఉద్యోగులు ఇళ్లకు వెళ్లేందుకు గంటల సమయం పడుతోంది.

పైపులైన్ నిర్మాణం అవసరం...

మ్యాన్‌హోల్స్ సంఖ్య పెంచి, వరదనీటి కోసం మరో పైపు లైన్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.



డీఎల్ఎఫ్ రోడ్డులో వాటర్ లాగింగ్ పాయింట్

క్యూమార్ట్

భారీ వర్షం వస్తే గచ్చిబౌలి ప్రధాన రహదారి క్యూమార్ట్ జంక్షన్ చెరువును తలపిస్తుంది. భారీ వరద కారణంగా వాహనాలు రాకపోకలకు ఆటంకం కల్గుతోంది. గచ్చిబౌలి, ఇనార్బిట్ మాల్ వైపు వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు. వరద నీరు నాలాలోకి వెళ్లేందుకు ఇకే మ్యాన్ ఉండటం గమనార్హం. భారీ వర్షం వస్తే ట్రాఫిక్‌పై రెండు గంటలు ప్రభావం ఉంటుంది.

మ్యాన్ హోల్స్ సంఖ్య పెంచాలి...

క్యూమార్ట్ జంక్షన్‌లో వరద నాలాలోకి సాఫీగా వెళ్లే విధంగా మ్యాన్‌హోల్స్ సంఖ్య పెంచాల్సి ఉంటుంది. అంతే కాకుండా నాలాలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలి.



గచ్చిబౌలి క్యూమార్ట్ జంక్షన్‌లో వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద ఉన్న ఒక్క మ్యాన్ హోల్

గోపన్‌పల్లిలో డ్రైనేజీ సమస్య పరిష్కారం



గోపన్‌పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లిలో డ్రైనేజీ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. దీనికితోడు గోపన్‌పల్లి ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్ పొంగి మురుగు రోడ్డుపైకి వస్తోంది. 4 రోజులుగా ఈ సమస్య నెలకొందంటూ గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.దీంతో ఆయన సోమవారం గోపన్‌పల్లిలో డ్రైనేజీ సమస్యను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీహెచ్ఎంసీ సిబ్బంది డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, మధు, స్థానికులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో జాప్యం వద్దు

వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్



శానిటేషన్ విభాగం అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్

గచ్చిబౌలి: అనుమతి లేకుండా విధులకు హాజరుకాని శానిటేషన్ సిబ్బందిపై చర్యలు తప్పవని వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీపీ పాయింట్లలో జూన్ 2 నాటికి చెత్తను పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. చెత్త సేకరణలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ డిప్యూటీ కమిషనర్ వేణు గోపాల్ రెడ్డి, నాలుగు సర్కిళ్ల ఏఎంఓహెచ్ లు డాక్టర్ నగేష్, కార్తీక్, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్లు జలంధర్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జగదీశ్వర్‌గౌడ్‌ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ని సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, నాగేష్ గౌడ్, షౌకత్అలీ మున్నా, డి.గోపాల్, లింగంరావు, భీమ్‌రావు, వై. శ్రీనివాస్, డి. సుధాకర్, రాజ్యలక్ష్మీ, అరుణ, సౌందర్య, స్వరూప,కృష్ణవేణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న వివేకానందనగర్‌లోని అపార్టుమెంట్‌వాసులు

ఆల్విన్‌కాలనీ: సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై సోమవారం వివేకానందనగర్ డివిజన్ పరిధి ఓల్గా ఫ్రైడ్ అపార్టుమెంట్స్, భాస్కర ప్యాలస్, శ్రీదేవి రెసిడెన్సీ, దీక్షా రెసిడెన్సీ, బాబు రెసిడెన్సీ, శ్రీ కృష్ణ నివాస్ అపార్టుమెంట్‌వాసులు ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ,వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ పైపులైన్ పరిమాణం పెంచుతామని తెలిపారు.

చెట్లు నరికివేత



కొండాపూర్‌లో ఫుట్‌పాత్‌పై ..

గచ్చిబౌలి: ఫుట్‌పాత్‌పై ఉన్న చెట్లను నరికివేశారు. కొద్ది రోజుల క్రితం కొండాపూర్‌లోని మైహోం మంగళ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఉన్న రెండు చెట్లను నరికి వేయడంతో మొండాలు దర్శనమిస్తున్నాయి. ఓ వైపు పచ్చదనం పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో భవనాలకు అడ్డు వస్తున్నాయని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా చెట్లను నరకడం రివాజుగా మారింది.

గుంతలరోడ్లతో ఇబ్బందులు



దీప్తిశ్రీనగర్-ఎంఏనగర్‌కు వెళ్లే రోడ్డు

మియాపూర్ : గుంతలరోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్ మదీనాగూడ దీప్తిశ్రీనగర్ కాలనీలోని ఎంఏనగర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలు పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గత నెల రోజుల కిందట ఈ రోడ్డును మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లు గుంతలు పడ్డాయి. అదేవిధంగా పలు ప్రధాన రహదారుల్లో వర్షానికి రోడ్డు పైకి వచ్చిన మట్టి, ఇసుకను తొలగించకపోవడంతో వాహనదారులు జారిపడుతున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జిగా కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పాలకుర్తి శాసనసభ ఇంచార్జిగా పార్టీ నాయకత్వం సోమవారం నియమించింది. గతంలో వరంగల్, మహబూబ్‌నగర్ ఉపఎన్నికలతో పాటు రాజరాజేశ్వరీనగర్ (బెంగళూర్), నారాయణపేట్, వికారాబాద్ ఎన్నికల్లో కూడా ఆయన పని చేశారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



విజేత జట్టుకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: క్రీడారంగానికి సంపూర్ణ సహకారం అందించడంతో పాటు, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పాటి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన పాటి క్రికెట్ ట్రోఫీ ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో 7 కోట్ల 50 లక్షల రూపాయలతో మైత్రి మైదానాన్ని ఆధునీకరించడంతో పాటు, పాటి గ్రామ పరిధిలో 5 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో మినీ స్టేడియం నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం విజేత జట్టు, రన్నరప్ జట్లకు లక్ష రూపాయల సొంత నిధులను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు లక్ష్మణ్, స్వామి గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



మణికొండ: ఎన్నికల వేళ ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిపేట మండలం, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 128లో గదులను నిర్మించారు. వాటిని పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు విక్రంరెడ్డి, సురేష్‌లు తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు సోమవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఉపేక్షించమన్నారు. మరోసారి వారు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే మండల పరిధిలో పదుల సంఖ్యలో క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో సోమవారం నిర్వహించిన నాగలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. బీఆర్‌యస్ నాయకులు కాశీనాథ్ యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, నాగభూషణం, జగదీష్, కటిక రవి, సత్యనారాయణ, యాదగిరిగౌడ్ భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



ఆనంద్ బాబు(ఫైల్)

గచ్చిబౌలి: స్విచ్ బోర్డులో రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, దుప్పలపూడికి చెందిన తుర్ల ఆనంద్ బాబు(32) కొండాపూర్ సబ్ స్టేషన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం రాఘవేంద్ర కాలనీ సీ బ్లాక్‌లో అర్జున్ హోమ్స్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన ఆనంద్ ఎల్‌టీ లైన్ సరఫరా అయ్యే స్విచ్ బోర్డులో పని చేస్తుండగా కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆనంద్ కేవలం మీటరు రీడింగ్ మాత్రమే చేయాల్సి ఉందని, సంబంధం లేని విధులు అప్పగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మృతుని సోదరుడు అలగ్జెండర్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా గ్రూపులో వచ్చిన మెసేజ్ చూసి ఎవరికి చెప్పకుండానే ఆనంద్ అక్కడికి వెళ్లాడని కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462